క్లుప్తంగా

పోలేరమ్మ శిడి మహోత్సవం రేపు



వేటపాలెం: స్థానిక నాయినపల్లిలో వేంచేసియున్న పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద మంగళవారం అమ్మవారి 47వ శిడి మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొడ్డు చెంచు యానాదిరావు ఇంటి వద్ద నుంచి ప్రభ ఊరేగింపుగా దేవస్థానం వద్దకు చేరుతుంది. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నాగవరపమ్మ హుండీ ఆదాయం రూ. 2.29 లక్షలు

వేటపాలెం: రామన్నపేట పంచాయతీ శివారులో వేంచేసి ఉన్న కనక నాగవరపమ్మ అమ్మవారి దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు సోమవారం నిర్వహించినట్లు ఆలయ ఈవో జీవీఎల్ కుమార్ సోమవారం తెలిపారు. గత ఐదు నెలల నుంచి భక్తులు హుండీలో వేసిన కానుకల నగదు రూ. 2.29 లక్షలుగా వచ్చాయని తెలిపారు. అమ్మవారి సంబరాలు ఈనెల 26 నుంచి ప్రారంభిస్తున్నందున ముందుగా హుండీ కానుకల లెక్కింపు చేశామని తెలిపారు. కార్యక్రమాన్ని ఈవో వెంకటేశ్వరావు పర్యవేక్షించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏ భానుమూర్తి, బండ్ల బాబు, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు అభినందన సభ

మేదరమెట్ల: కొరిశపాడు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పనిచేస్తున్న వలంటీర్లకు నేడ మంగళవారం ఆయా సచివాలయాల్లో అభినందన సభ ఉంటుందని ఎంపీడీవో సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య హాజరవుతారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3గంటలకు మేదరమెట్ల సచివాలయం వద్ద మేదరమెట్ల 1,2,3, తమ్మవరం, తిమ్మనపాలెం, బొడ్డువానిపాలెం, దైవాలరావూరు వలంటీర్లకు, మధ్యాహ్నం 3.30 గంటలకు కొరిశపాడు మండల కార్యాలయం ప్రాంగణంలో కొరిశపాడు 1,2, రావినూతల 1,2, పమిడిపాడు1,2, పీ.గుడిపాడు, రాచపూడి వలంటీర్లను సత్కరిస్తారని చెప్పారు. కార్యక్రమాలకు అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

26న బల్లికురవ, కొప్పరపాడులో వలంటీర్లకు వందనం.

బల్లికురవ: 26 శుక్రవారం సాయంత్రం బల్లికురవ, కొప్పరపాడు గ్రామాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమం చేపట్టినట్లు ఎంపీడీవో సీహెచ్ కృష్ణ సోమవారం తెలిపారు. కార్యక్రమాలకు రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రలకు నగదుతో పాటు సత్కారాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చెప్పారు.

25న అద్దంకిలో జగనన్న ఆణిముత్యాలు

అద్దంకి రూరల్: అద్దంకి ప్రకాశం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఈనెల 25న జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించనున్నట్లు అద్దంకి స్పెషల్ ఆఫీసర్ శంకర్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నియోజకవర్గస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదు బహుమతులతోపాటు, మెడల్, సర్టిఫికెట్ అందజేసి వారి తల్లిదండ్రులకు సన్మానం నిర్వహిస్తారని ప్రకటనలో పేర్కొన్నారు.

హోరాహోరీగా చదరంగం, షటిల్ పోటీలు

అద్దంకి రూరల్: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శింగరకొండ సమీపంలోని ఇండోర్ స్టేడియంలో సోమవారం నిర్వహిస్తున్న చదరంగం, షటిల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. చదరంగంలో 30మంది, షటిల్‌లో 20 మంది పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా వాసవీ క్లబ్ గవర్నర్ ఊటుకూరి ఉమా అన్నపూర్ణ తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పూర్వ గవర్నర్లు, అంతర్జాతీయ ఎగ్జిక్యూటివ్ అధికారులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు

రెండు బైకులు ఢీ, ఇద్దరికి గాయాలు

అద్దంకి రూరల్: రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన సోమవారం రాత్రి మండలంలోని తిమ్మాయపాలెం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. ముండ్లమూరు మండలం కెల్లంపల్లి గ్రామానికి చెందిన దాసరి యేసయ్య బైక్‌పై దర్శివైపు వెళ్తున్నాడు. చెరువుకొమ్ముపాలేనికి చెందిన బాలిశెట్టి సుబ్బారావు అద్దంకి వైపు బైక్ మీద వస్తున్నాడు. సరిగా తిమ్మాయపాలెం గ్రామ సమీపంలోని ఇటుకబట్టిల వద్ద రాగానే ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు.

సర్కారు బడులకు భద్రత

- నైట్ వాచ్‌మెన్‌ల నియామకం
- ఆకతాయిలకు చెక్
- సంతోషం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



పందిళ్లపల్లి హైస్కూలు

వేటపాలెం: నాలుగేళ్లలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేశారు. గత ప్రభుత్వం పాఠశాలలను నిర్వీర్యం చేసి పూర్తిగా కార్పొరేట్ సేవలో నిమగ్నమైంది. ఫలితంగా విద్యావ్యవస్థ గాడితప్పి పేద ప్రజల పిల్లలు అవస్థలు పడ్డారు. అయితే సీఎం జగన్ రాష్ట్రంలో ప్రత్యేకంగా విద్యారంగాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో నాడు–నేడు కార్యక్రమంతో ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు. అందుకు తగిన విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, వనరుల కల్పనకు కోట్లు ఖర్చు చేశారు. విద్యార్థుల కోసం వివిధ పరికరాలు, బెంచీలు, కుర్చీలు అంటి అనేకమైన పరికరాలు నూతనంగా కొనుగోలు చేసి అభివృద్ధి చేశారు. గతంలో పాఠశాలలో దొంగలు కంప్యూటర్లు, టీవీలు, కిటికీలు, బెంచీలు వంటివి దొంగతనాలు జరిగిన ఘటనలు అనేకం ఉన్నాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని నేడు ప్రభుత్వం పాఠశాలలకు నైట్ వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేసేందుకు పూనుకుంది. నైట్ వాచ్‌మెన్‌ల ఏర్పాటు చేయడంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి నైట్ వాచ్‌మెన్‌లు లేకపోవడంతో చాలాసార్లు చోరీలు జరిగాయి. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మార్చేస్తున్నారు. మద్యం మత్తులో ఆస్తులను, ఫర్నిచర్లను ధ్వంసం చేసిన ఘటనలు ఉన్నాయి. పాఠశాలలకు రక్షణ కరువైన నేపథ్యంలో ప్రభుత్వం నైట్ వాచ్‌మెన్‌లను నియమిం చేందుకు చర్యలు చేపట్టింది.

స్థానికులకే ప్రాధాన్యం..

జిల్లా పరిషత్ హైస్కూళ్లకు నైట్ వాచ్‌మెన్‌లను నియమిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంపై హెచ్‌ఎంలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నెలకు రూ. 6 వేల గౌరవ వేతనం ఇస్తారు. నైట్ వాచ్‌మెన్ పోస్టులకు సంబంధించి ఆదే హైస్కూలో పని చేసే మహిళ భర్తకు ప్రాధాన్యత ఇవ్వనుంది. 60 ఏళ్ల లోపు వయసున్న ఎక్స్‌సర్వీస్ మెన్ గాని, పేరెంట్స్ కమిటీ ఎంపికచేసే వ్యక్తిని గాని నియమించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ షరతుల ప్రకారం ఎంఈవో, హెచ్‌ఎంల సమన్వయంతో నమ్మకంగా పనిచేసే వాచ్‌మెన్‌లను నియమించుకున్నారు.

మండలంలో ఐదు స్కూళ్లలో..

వేటపాలెం మండల పరిధిలో కొత్తగా నాలుగు ఉన్నత పాఠశాలలకు నైట్ వాచ్‌మెన్‌లు ఏర్పాటు చేశారు. కొత్తపేట, దేశాయిపేట, పందిళ్లపల్లి, అక్కాయిపాలెం హైస్కూళ్లలో నియమించారు. వేటపాలెం జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు గతంలోనే నైట్ వాచ్‌మెన్ ఉన్నారు. మండలం పరిధిలోని మొత్తం ఐదు హైస్కూళ్లకు నైట్ వాచ్‌మెన్‌లు ఉన్నారు.

పాఠశాలలకు రక్షణ..



ఉన్నత పాఠశాలలకు నైట్ వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయం. గతంలో చాలా సార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. దీంతో పాఠశాలల ఆస్తులకు రక్షణ ఏర్పడింది. నాలుగు స్కూళ్లకు వాచ్‌మెన్‌లను నియమించాం.

– ఎస్ నిరంజన్, ఎంఈవో, వేటపాలెం



వలంటీర్లను సన్మానిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

వలంటీర్లు సంక్షేమ వారధులు

- ఏపీ శాప్ నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

జే.పంగులూరు: సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే వారధులు వలంటీర్లేనని ఏపీ శాప్ నెట్ చైర్మన్, అద్దంకి నియోకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య అన్నారు. మండల పరిధిలోని పంగులూరు, కొండమంజులూరు గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం ఎంపీడీవో రమణ మూర్తి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కృష్ణచైతన్య మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. గుమ్మం వద్దకే ప్రభుత్వ పథకాలు అందుతుండటంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆయన చెప్పారు. ప్రతి నెల ఒకటో తేదీన వేకువ జామునే పింఛన్లు పంపిణీ చేసే విషయంలో వలంటీర్లది గొప్ప కృషి అని కొనియాడారు. ఏకంగా 2.5 లక్షల మంది వలంటీర్లు, 1.5 లక్షల మంది సచివాలయ ఉద్యోగులు మొత్తం నాలుగు లక్షల మంది ఈవ్యవస్థ కోసం పనిచేస్తున్నారన్నారు. జగనన్న తీసుకొచ్చిన పరిపాలన, సంస్కరణలో ఇదోక చరిత్రని కొనియాడారు. అనంతరం కృష్ణచైతన్య ఉత్తమ వలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పబ్లిసిటీ వింగ్ జంపాని రవి, ఎంపీపీ తేళ్ల నాగమ్మ, జెడ్పీటీసీ రాయిని ప్రమీళ, మండల ఉపాధ్యక్షులు యర్రం శ్రీనివాసరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిణి వెంకట సుబ్బారావు, పంగులూరు సర్పంచ్ గుడిపూడి నాగేంద్రంరామావు, కొండమంజులూరు సర్పంచ్ చొప్పరపు ప్రభాకర్, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే



మహిళకు బుక్‌లెట్ అందిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణమోహన్



ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఆమంచి

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్

పర్చూరు (చినగంజాం): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అన్నింటిని నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఏదుబాడు, తన్నీరువారిపాలెం గ్రామాల్లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామానికి చేరుకున్న ఆయనకు గ్రామప్రజలు పూలతో ఘన స్వాగతం పలికారు. ఎస్సీ కాలనీలోని వైఎస్సార్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల గురించి ప్రచారం చేయడంతో పాటు నవరత్నాలు గురించి వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని పర్యటనను ఉత్సాహపరచడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. మహిళలు సీఎంకు నీరాజనాలు పలుకుతున్నారని, ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ఆరోపణలు నమ్మవద్దని ఆయన ప్రజలను కోరారు. గ్రామంలో ఆయన పర్యటించి ప్రధాన సమస్యల గురించి తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఏదుబాడు సర్పంచ్ కట్టా ఏసుపాదం, ఎంపీటీసీ కట్టా జగదీష్, నాయకులు కట్టా రత్నరాజు, దాసరి వెంకట్రావు, తోకల కృష్ణమోహన్, ముప్పాళ్ల రాఘవ, కొల్లా శ్రీహరి, జంగా అనిల్, ఉప్పలపాటి అనిల్, కూరాకుల ఇస్సాక్, దగ్గుబాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అంకమ్మతల్లి కొలుపులు



అమ్మవారి ఉత్సవ విగ్రహాలు, వల్లిఆవు



కార్యక్రమంలో ఒట్టిగొర్ల కుటుంబ సభ్యులు

బల్లికురవ: మండలంలోని కొప్పరపాలెం గ్రామంలో ఒట్టిగొర్ల వారి అంకమ్మతల్లి కొలుపులు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లో ఉన్న ఒట్టిగొర్ల కుటుంబ సభ్యులంతా అమరావతి సముద్ర స్నానానికి గ్రామోత్సవంతో తరలివెళ్లారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాలు, వల్లిఆవును తీసుకెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. ఆతర్వాత గ్రామోత్సవంతో తిరిగి గ్రామానికి చేరారు. సోమవారం మాతుడుకు, గజాల కొలుపు సంబరం చేపట్టారు. మంగళవారం పుట్ట బంగారం కొలుపు, బుధవారం దీపం అవసరం, తేనేఆట, గ్రామోత్సవం పాపావేషం, గురువారం గుడార సేవ, కొలుపుల ముగింపు రాత్రికి అన్నదానం చేపడుతున్నట్లు తెలిపారు.

26 నుంచి నాగవరపమ్మ సంబరాలు



కనక నాగవరపమ్మ మూల విరాట్

వేటపాలెం: రావూరిపేట శివారులో పంట పొలాల్లో వేంచేసియున్న కనక నాగవరపమ్మ అమ్మవారి సంబరాలు ఈనెల 26 నుంచి జూన్ 3వ తేదీ వరకు జరగనున్నాయని ఈవో జీవీఎల్ కుమార్ సోమవారం తెలిపారు. 26న సంతరావూరు గ్రామంలో మీసాల బాబురావు ఇంటి వద్ద అమ్మవారి గిలకల మందిరం నందు అమ్మవారి నిధి మీదకి వస్తుంది. 27న అమ్మవారి పావనం సముద్ర స్నానానికి బయలు దేరుతుంది. 28, 29వ తేదీల్లో గ్రామస్తుల ఆర్థిక సహకారంతో అమ్మవారి కొలుపులు జరగనున్నాయి. 31న పొంగళ్ల కార్యక్రమం, జూన్ 1, 2 తేదీల్లో రెండు రోజుల పాటు వేటపాలెం పరిసర గ్రామాల్లో అమ్మవారి జోగి కార్యక్రమాలు నిర్వహిస్తారు. 3వ తేదీన వైభవంగా అమ్మవారి శిడి మహోత్సవంతో సంబరాలు ముగుస్తాయ ఈవో జీవీఎల్ తెలిపారు.

శ్మశాన భూములను కాపాడుకుందాం

వేటపాలెం: గ్రామంలోని అన్ని సామాజిక వర్గాలకు సంభందించిన శ్మశాన భూములు ఆక్రమణలకు గురి కాకుండా కాపాడుకొందామని సామాజికవర్గ పెద్దలు అన్నారు. స్థానిక వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో వివిధ సామాజికవర్గాల పెద్దలు సమావేశం సోమవారం రాత్రి నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి దేవస్థాన అధ్యక్షుడు ముత్తుకుమరన్ మాట్లాడుతూ శ్మశాన భూముల్లో ఉన్న ఇసుకను రాత్రి వేళల్లో ఆక్రమంగా తరలించకుండా కాపాడుకోవాలని తెలిపారు. కొన్ని సామాజిక వర్గాలకు చెందిన వారు సొంతంగా చందాలు వేసుకొని ప్రహరీలు ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. అయితే దీనిపై కొందరు శ్మాశానం వాటికలను ఆక్రమించు కొన్నారని అసత్య ఆరోపణలతో ఉన్నత అధికారులకు తరచూ ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. దీన్ని అన్ని సామాజిక వర్గాల ఖండించాలన్నారు. కే సుబ్రహ్మణ్య కుమార్, పీ. వెంకటేశ్వర్లు, మురళీ, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో నవశకానికి నాంది

- ఏపీ శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య



లబ్ధిదారులతో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

జే పంగులూరు: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలతో నవశకానికి నాంది పలికారని ఏపీ శాప్ నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముప్పవరం గ్రామంలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణచైతన్య గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల గురించి వివరించారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ పథకాలు సకాలంలో అందుతున్నాయన్నారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టి తీసుకొస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి వర్గానికి ఆర్థిక లబ్ధి చేకురుతోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పులికం కోటిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు యర్రం శ్రీనివాసరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ రాయిణి వెంకటసుబ్బారావు, ఎంపీటీసీ పూసల గంగాధర్, సర్పంచ్ రౌతు సాంబశివరావు, రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు రామాంజినేయులు, కామేపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రీనివాసరావు

మేదరమెట్ల: ఎస్సీ, ఎస్టీలు వ్యవసాయ అభివృద్ధి పథకాలపై అవగాహన పెంచుకోవాలని ఏవో శ్రీనివాసరావు అన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో మండలంలోని ఎస్సీ ఎస్టీ రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల రైతులకు అందుబాటులో ఉండేందుకు గాను గ్రామాలల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామని, అందులో విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, ఎరువులను సబ్సిడీపై రైతులకు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో పీ.గుడిపాడు వీఏఏ మేరి, డీబీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

టిఫిన్ దుకాణంలో అగ్నిప్రమాదం

చీరాల అర్బన్: మండలంలోని ఈపూరుపాలెంలో టిఫిన్ దుకాణంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈపూరుపాలెంలోని ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో మాచర్ల వెంకటేశ్వరరావు టిఫిన్ దుకాణంలో సోమవారం గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్ వద్ద గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ మేరకు దుకాణం యజమాని వద్ద నుంయి వివరాలను నమోదు చేశారు. ప్రమాదంలో సుమారు రూ.5 వేల వరకు నష్టం వాటిల్లింది.

ఆచార్య విశ్వనాథరెడ్డి మృతికి నివాళులు



విశ్వనాథరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సృజన సభ్యులు

అద్దంకి: ప్రముఖ సాహితీవేత్త, కథకుడు, విమర్శకులు, కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం గ్రహీత ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి సోమవారం ఒంగోలులో మృతి చెందారు. అద్దంకి సృజన సభ్యులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సృజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకరదత్తు మాట్లాడుతూ రాయలసీమ ప్రజాజీవితాన్ని కథల్లో కళ్లకు కట్టినట్లు చిత్రీకరించిన రచయిత ఆచార్య విశ్వనాథరెడ్డి అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి అనిల కుమారసూరి, సంకా సుబ్రమణ్యం, షేక్‌మహమ్మద్ రఫీ, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, ఇలపావులూరి శేషతల్పశాయి, కందులనాగిరెడ్డి, అనంతు నాగేశ్వరరావు, అద్దంకి లెవీ ప్రసాద్, జ్యోతి చంద్రమౌళి, పీసిహెచ్ కోటయ్య, సృజన సభ్యులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన భరత్



సీఎం జగన్ మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న గొట్టిపాటి భరత్

పర్చూరు (చినగంజాం): గురజాల నియోజకవర్గ పరిశీలకుడు, పర్చూరు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు గొట్టిపాటి భరత్ సోమవారం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని సీఎం క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన తల్లి గొట్టిపాటి పద్మతో పాటు కలసి సీఎంకు పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితుల గురించి ఆయన చర్చించారు.

విద్యార్థులకు స్పెల్లింగ్ బీ పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న సభ్యులు

చీరాల అర్బన్: గీతా యంగ్ సైంటిస్ట్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో స్పెల్లింగ్ బీ పోటీలు నిర్వహించారు. సైన్స్, మ్యాథ్స్, టెక్నాలజీ సబ్జెక్టులపై పోటీలను వలివేటి మురళీకృష్ణ నిర్వహించారు. 25 పాఠశాలల నుంచి 94 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 6,7 తరగతుల వారిని జూనియర్లుగా, 8,9,10 తరగతుల వారిని సీనియర్ కేటగిరిగా విభజించి రాత పరీక్ష నిర్వహించారు. ఒక్కో విభాగంలో పది మందిని ఫైనల్స్‌కు ఎన్నుకుని వారికి మౌఖికంగా పోటీ నిర్వహించారు. రెండు నిమిషాల సమయంలో ఎక్కువ పదాలకు స్పెల్లింగ్ చెప్పిన వారిని విజేతలుగా నిర్ణయించారు. చీరాల ప్రాంత విద్యార్థులను అంతర్జాతీయ స్థాయి పోటీకి సిద్ధం చేయడమే తమ ముఖ్య ఉద్దేశమన్నారు. మొదటి బహుమతి రూ.1000, రెండో బహుమతి రూ.500, సర్టిఫికెట్లు, పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఐ.బాబూరావు, బాలవెంకటేశ్వరరావు, పోలుదాసు రామకృష్ణ, చీరాల కృష్ణమూర్తి, శివాంజనేయప్రసాద్, భారత్, వెన్నెల, కిరణ్, లావణ్య, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు



పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన ప్రజలు

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని గంగవరం గ్రామంలోని సొసైటీ భవనం నందు ఒంగోలు కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరం నందు సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందజేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరం నందు బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి గుండె, కిడ్నీ, విషజ్వరాలు వంటి వ్యాధులకు వైద్యులు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సూచించారు. ప్రతి ఒక్కరికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తామని కిమ్స్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రఫి తెలిపారు. శిబిరం నందు వైద్యులు డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ రాణి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.